సాక్షి చిత్తూరు

శుక్రవారం । 17 । జనవరి । 2025



రంకేసిన ఉత్సాహం

కురివికుప్పం, బ్రాహ్మణపల్లెలో జల్లికట్టు జరిగింది. కోడెగిత్తల జోరుకు యువత కళ్లెం వేసేందుకు ఉత్సాహం చూపింది. - 8లో



పులిగుండు..భక్త జన దండు

పెనుమూరు సమీపంలోని పులిగుండు వద్ద గిరి ప్రదక్షిణకు భక్తులు పోటెత్తారు. పులి గుంటీశ్వరుడిని దర్శించుకున్నారు. - 8లో



నేత్రానందంగా ఊంజల్ సేవ

కాణిపాకంలోని వరసిద్ధివినాయక స్వామివారికి చేసిన ఊంజల్ సేవ నేత్రానందంగా సాగింది. - 8లో

న్యూస్‌రీల్

నేడు సంకటహర చతుర్థి

కాణిపాకం: వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో శుక్రవారం సంకటహర చతుర్థి నిర్వహించనున్నట్లు ఈఓ పెంచల కిషోర్ తెలిపారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు గణపతి వ్రతం పూజలు జరుగుతాయన్నారు. అలాగే రాత్రి 7 నుంచి 8 గంటల వరకు స్వర్ణ రథోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

20న హుండీ లెక్కింపు

కాణిపాకం: వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలోని హుండీల లెక్కింపు ఈనెల 20వ తేదీన నిర్వహించనున్నట్లు ఈఓ పెంచల కిషోర్ తెలిపారు. ఉదయం 7 గంటలకు ఆలయ ఆస్థాన మండపంలో హుండీ లెక్కింపు జరుగుతుందన్నారు. ఆలయ అధికారులు, సిబ్బంది విధిగా పాల్గొన్నాలని పేర్కొన్నారు.

పరీక్షల నిర్వహణలో తప్పులు చేయకండి

చిత్తూరు కలెక్టరేట్ : జవహర్ నవోదయ పరీక్షల నిర్వహణలో ఎలాంటి తప్పులు చేయవద్దని విద్యాశాఖ ఏడీ–1 రంగస్వామి అన్నారు. జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షల నిర్వహణపై గురువారం డీఈఓ కార్యాలయం పక్కనున్న ప్రభుత్వ పాఠశాలలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ఈ నెల 18వ తేదీన జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షలకు 26 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరీక్షలకు 5,058 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీ చర్యలు చేపడుతున్నామన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురాకుండా చర్యలు చేపట్టాలన్నారు. నియమ, నిబంధనల ప్రకారం పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. అన్నమయ్య జిల్లా పరీక్షల విభాగం ఏసీ రవికుమార్, నవోదయ కళాశాల ప్రిన్సిపల్ వేలాయుధం, డీఈఓ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ మధు, ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని చీఫ్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీ-1 రంగస్వామి

రెవెన్యూ సదస్సులకు 10,544 అర్జీలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు 10,544 అర్జీలు అందినట్లు డీఆర్వో మోహన్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని 822 రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించినట్లు చెప్పారు. ఈ సదస్సుల్లో నమోదైన అర్జీలన్నింటిని ఆన్‌లైన్ చేశామన్నారు. ఇప్పటి వరకు 1,318 అర్జీలు పరిష్కరించగా, మిగిలిన 9,226 అర్జీలను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.

దేవతలు.. దీవెనలు..

ముక్కనుమ సంబరం.. కరకంఠేశ్వరుడి ఆహ్వానం.. ద్విదశ దేవతల ఆగమనం.. అతిథి దేవుళ్లకు ఆతిథ్యం.. పరివట్టంతో గౌరవం.. మార్గం మధ్యలోని పల్లెల్లో రంగవల్లులతో స్వాగతం.. నారికేళ సమర్పణం.. భక్తుల కోలాహలం నడుమ కొండచుట్టు మండపానికి వేంచేపు చేసిన దేవతాగణం.. విద్యుద్దీపాలు, కాగడాల వెలుగుల్లో తరలివచ్చిన 21 మంది దేవతలు భక్తులకు దీవెనలు అందించారు. నగరి పట్టణంలోని కరకంఠేశ్వరస్వామి కొండచుట్టు వైభవం ఇదీ.



నగరిలోని కొండచుట్టు మండపం వద్ద దేవతల సందింపు

- ముక్కనుమకు విచ్చేసిన దేవతలు
- ఊరేగింపుగా వచ్చిన 21 దేవతలతో నెలకొన్న సందడి
- దేదీప్యమానంగా దేవతల సందింపు

ఎదురుకోలు



భక్త జనసందోహం నడుమ కరకంఠేశ్వరస్వామి

వివిధ గ్రామాల నుంచి ట్రాక్టర్లపై వచ్చిన ఉత్సవమూర్తులకు కరకంఠేశ్వర స్వామి ఎదురెళ్లి ఆహ్వానం(ఎదురుకోలు) పలుకగా కొండచుట్టు మండపం వద్దకు చేరి విఘ్నేశ్వరుని దర్శించుకుని సమీప మైదానంలో కొలువుదీరారు.

నగరి : ఉమ్మడి జిల్లాలోనే నగరి పట్టణంలో ముక్కనుమ సందర్భంగా నిర్వహించే కొండచుట్టు ఉత్సవాలకు ప్రత్యేకత ఉంది. మనం బంధువులను పెద్దపండుగకు ఎలా ఆహ్వానిస్తామో.. అలా నగరి పట్టణంలోని కరకంఠేశ్వరస్వామి తన పరిసర ప్రాంతాల్లో ఉన్న ఆలయాల్లోని దేవతలను ఆహ్వానిస్తారని.. ఆయన ఆహ్వానం మేరకు కొండచుట్టు మండపం వద్దకు విచ్చేసే దేవతలకు కరకంఠేశ్వరస్వామి ఆతిథ్యం ఇచ్చి.. గౌరవించి పంపుతారన్నది ప్రతీతి. ఆనవాయితీ ప్రకారం ఆహ్వానం పంపడంతో ఆయా ఆలయాల్లో ఉదయం నుంచి దేవతల ఉత్సవ మూర్తులకు అలంకరణ ఏర్పాట్లు ప్రారంభించారు.

కర్పూర హారతులు

ఊరేగింపుగా విచ్చేసిన దేవతలకు ఆయా గ్రామాల్లో గ్రామస్తులు దారి పొడవునా రంగవల్లులు దీర్చిదిద్ది ఆహ్వానించారు. కర్పూర హారతులిచ్చి కొబ్బరి కాయలు కొట్టి దర్శించుకున్నారు.

పోటెత్తిన భక్తులు

రాత్రి కొండచుట్టు మండపం సమీపం ఉన్న మైదానంలో దేవతల సందింపు ఏర్పాటు చేయగా ఆ కమనీయ దృశ్యాన్ని తిలకించేందుకు ప్రజలు పోటెత్తారు.


దేవతలకు ఆహ్వానం పలికేందుకు ముందుగా వెళ్లాల్సిన కరకంఠేశ్వర స్వామికి ఉదయం అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించి కొండచుట్టు మండపం వద్దకు వేంచేపు చేశారు.

దేవతల ఆగమనం

కరకంఠేశ్వర స్వామి ఆహ్వానం మేరకు నారాయణవనంలోని అగస్తీశ్వరస్వామి, పరాశురేశ్వరస్వామి, బుగ్గ కాశీవిశ్వేశ్వరస్వామి, పాలమంగళం నుంచి పాళేశ్వర స్వామి, ముడిపల్లి అగస్తీశ్వరస్వామి, రాధారుక్మిణీ, కరింబేడు నాథాళీశ్వరస్వామి, మేళంబాకం రాధాకృష్ణ స్వామి నగరి పట్టణానికి విచ్చేశారు. అలాగే మిట్టపాళెం పాళేశ్వరస్వామి, దేశూరు అగరం నుంచి వేణుగోపాలస్వామి, కృష్ణరామాపురం గ్రామం నుంచి శివపార్వతులు, తెరణి వైకుంఠనాథస్వామి, సత్రవాడ చిదంబరేశ్వరస్వామి శివగామి సుందరి, చింతలపట్టెడ శరవణ వినాయక, అగర వినాయక స్వామి, మేళపట్టు పరమేశ్వరుడు, ఎలకాటూరు కృష్ణమూర్తి స్వామి, చవరంబాకం పరమేశ్వరస్వామి, కళియంబాకం కాళేశ్వర స్వామి, జ్ఞానమ్మ పట్టెడ నుంచి మీనాక్షిదేవి, మూలనెత్తం నుంచి ఈశ్వరుడు, వినాయకుడు కొండచుట్టు మండపానికి చేరుకున్నారు.

ఘనంగా వీడ్కోలు

విచ్చేసిన దేవతల తరపున అర్చకులకు కరకంఠేశ్వర ఆలయ అర్చకులు పరివట్టం కట్టి మర్యాదలు చేసి, ఘనంగా వీడ్కోలు పలికారు. ఏకకాలంలో అందరు దేవతలు ఒక్కచోట చేరడం అందరికీ ఒక్కసారిగా హారతి ఇవ్వడం ప్రత్యేక సంతరించుకుంది.



విద్యుత్ దీపాల వెలుగులో కొండచుట్టు మండపం

నేడు, రేపు అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు

చిత్తూరు అర్బన్: కానిస్టేబుల్ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ భాగంలో వాయిదా పడిన రెండు రోజుల దేహదారుఢ్య పరీక్షలు శుక్ర, శని వారాల్లో నిర్వహించనున్నట్లు ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. వైకుంఠ ఏకాదశి కారణంగా ఈ నెల 8,9 తేదీల్లో జరగాల్సిన దేహదారుఢ్య పరీక్షలను వాయిదా వేశామన్నారు. ఈ రెండు రోజుల పరీక్ష నిర్వహణను నేడు, రేపు నిర్వహిస్తామన్నారు. అలాగే అప్పీల్‌కు అభ్యర్థులు ఈ నెల 20వ తేదీ జిల్లా పోలీసు ట్రైనింగ్ సెంటర్ మైదానానికి విచ్చేయాలని కోరారు.

పకడ్బందీగా జాతీయ కుష్టు నిర్మూలన సర్వే



అవగాహన పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఈ నెల 20వ తేదీ నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు జాతీయ కుష్టు నిర్మూలనా సర్వేని పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో సర్వే పోస్టర్లు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో కుష్టు వ్యాధిని పూర్తిగా నిర్మూలించే చర్యలు చేపట్టాలన్నారు. వ్యాధిని గుర్తించి ప్రారంభ దశలోనే నిర్మూలించేందుకు చికిత్సలు చేయాలన్నారు. జిల్లాలో ఫిబ్రవరి 2 వ తేదీ వరకు చేపట్టే ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కుష్టు వ్యాధి లక్షణాలు, చికిత్స, నివారణ మార్గాలను ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి పాఠశాలలో ప్రతి విద్యార్థిని తనిఖీ చేయాలన్నారు. లక్షణాలు కనిపిస్తే వెంటనే గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ విద్యాధరి, ట్రైనీ హిమవంశీ, డీఎంఅండ్‌హెచ్‌వో సుధారాణీ, తదితరులు పాల్గొన్నారు.

సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌కు జిల్లా విద్యార్థి

చిత్తూరు కలెక్టరేట్ : సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌కు జిల్లాలోని పులిచెర్ల మండలం ఎల్లన్నగారిపల్లె జెడ్పీ హైస్కూల్‌లో చదువుతున్న తొమ్మిదో తరగతి విద్యార్థి ఆకాష్ ఎంపికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ అధికారులు గురువారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆ ఉత్తర్వుల మేరకు జిల్లాకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి ఆకాష్ (అడ్వాన్స్ స్మార్ట్ హౌస్) అనే ప్రాజెక్టును రూపొందించడంతో సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌కు ఎంపికయ్యారు. ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు తమిళనాడు రాష్ట్రం పాండిచ్చేరిలో నిర్వహించే సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో జిల్లా విద్యార్థి పాల్గొంటాడని జిల్లా విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.



సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైన విద్యార్థి ఆకాష్ ప్రాజెక్టు

రీసర్వే పక్కాగా నిర్వహించాలి

గుడిపాల: రీసర్వే పక్కాగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ విద్యాధరి తెలిపారు. గురువారం గుడిపాల మండలంలోని శ్రీరంగంపల్లె పంచాయతీని రీసర్వేకు సంబంధించి మోడల్ విలేజ్‌గా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా రీసర్వే ఎలా జరుగుతుందన్న విషయం తెలుసుకున్నారు. ప్రతి రైతును పొలం వద్దకు పిలిపించుకుని సమగ్రంగా విచారించి, సర్వే నిర్వహించాలన్నారు. రైతుల నుంచి ఫిర్యాదులు అందితే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భూములుండి రైతు మరణించినట్లయితే వారి కుటుంబసభ్యుల పేరున మార్చేందుకు రికార్డులను సమగ్రంగా పరిశీలించి, చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, సర్వేయర్లు గోపి, కిరణ్, కోటి పాల్గొన్నారు.



రీసర్వే రికార్డులు పరిశీలిస్తున్న జేసీ విద్యాధరి

హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించండి

- కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ



రోడ్డు భద్రతా మాసోత్సవాల బ్యానర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : హెల్మెట్ వినియోగంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో వరుస సమీక్షలు నిర్వహించారు. రవాణాశాఖ అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 16వ తేదీ నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ ద్విచక్ర వాహనచోదకులు ఉన్నట్లు చెప్పారు. ప్రాణాలు కోల్పోయిన వారిలో ఎక్కువ మంది హెల్మెట్ వినియోగించని వారే ఉన్నట్లు తెలిపారు. హెల్మెట్ ధరించడంతో ప్రాణాలు కాపాడుకోవచ్చన్నారు. భద్రతా మాసోత్సవాల్లో విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. యువత కచ్చితంగా హెల్మెట్ వినియోగించేలా ప్రిన్సిపాళ్లు చర్యలు చేపట్టాలన్నారు. భద్రతా మాసోత్సవాల్లో మారథాన్, వాకథాన్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రాజశేఖర్ బాబు, డీటీసీ నిరంజన్‌రెడ్డి, డీఎంఅండ్‌హెచ్‌వో సుధారాణి, డీసీహెచ్‌ఎస్ ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా టీకాల కార్యక్రమం

జిల్లాలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారుల సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో టీకాలు వేసుకోని పిల్లల జాబితాలను డాక్టర్లు సిద్ధం చేసుకోవాలన్నారు. ఏఎన్‌ఎంలు నిర్వహించే రిజిస్టర్లను తనిఖీ చేయాలన్నారు. పిల్లలందరికీ తల్లిదండ్రులు తప్పనిసరిగా వ్యాక్సినేషన్ వేయించాలన్నారు. గర్భిణుల్లో రక్తహీనత తగ్గించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సుధారాణి, అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటప్రసాద్, డీఐఓ హనుమంతరావు, మెడికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

అనారోగ్యమస్తు!

ఆరోగ్యవంత సమాజంతో రాష్ట్రం సౌభాగ్యం.. ఈ ఆలోచనతోనే నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీకి పురుడు పోశారు. ఫలితంగా వేలాది మంది పేదలు లబ్ధి పొందారు. అయితే కూటమి అధికారంలోకి రాగానే ఆరోగ్యశ్రీ పథకానికి సుస్తీ చేసింది. నెట్‌వర్క్ ఆస్పత్రులకు బకాయిల పేరుకుపోవడంతో వైద్యసేవలు ఘోరంగా మారాయి. ఫలితంగా పేద రోగులు ప్రైవేటు ధాటికి తట్టుకోలేక తల్లడిల్లుతున్నారు. అనారోగ్యం బారిన పడుతున్నారు.

బకాయిల రోగం.. సేవలు ఘోరం

- జిల్లాలో రూ.కోట్లలో పేరుకున్న ఆరోగ్యశ్రీ బకాయిలు
- వైద్యం చేయడంపై డైలమాలో పడిన ఆస్పత్రులు
- బకాయిలివ్వక తాజా చికిత్స భారం
- భరించలేమంటున్న నెట్‌వర్క్ ఆస్పత్రుల నిర్వాహకులు
- గత ఐదేళ్లలో రూ.543 కోట్ల విలువైన చికిత్సలు



ప్రభుత్వాస్పత్రి వార్డులో రోగులు

జిల్లాలో ఆరోగ్యశ్రీ వివరాలు



- గత ఐదేళ్లలో వైద్య సేవలు పొందినవాళ్లు **16.25** లక్షల మంది
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఖర్చు చేసిన మొత్తం - రూ.**543** కోట్లు
- ఆరు నెలలుగా వైద్య సేవలు పొందినవారు **88** వేల మంది
- ప్రైవేటు ఆస్పత్రులకు మొత్తం బకాయిలు రూ.**21** కోట్లు (సుమారు)
- రోజుకు ఆరోగ్యశ్రీ కింద ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లే వారి సంఖ్య **456** మంది

చిత్తూరు అర్బన్: విద్య, వైద్యం మానవ జీవితంలో ఎంత అవసరమో గుర్తించిన దివంగత సీఎం వైఎస్.రాజశేఖరరెడ్డి. సామాన్యుడికి ఆరోగ్యశ్రీ పేరిట కార్పొరేటర్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం, ఫీజు రీయింబర్స్‌మెంట్ తీసుకొచ్చారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎంత ఇబ్బందుల్లో ఉన్నా.. ఆ మహానేత తనయుడిగా, గత ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి సైతం పేదలకు ప్రైవేటు ఆస్పత్రుల్లో ఉచిత వైద్యసేవలు, ఆపరేషన్లు కొనసాగిస్తూ ఆరోగ్యశ్రీకి అండగా నిలిచారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్లక్ష్యం చేస్తోంది. ఉద్దేశపూర్వకంగా నెట్‌వర్క్ ఆస్పత్రులకు ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించకుండా కాలయాపన చేస్తోంది.

లక్షలాది మందికి పునర్జన్మ...

చేతిలో డబ్బుల్లేక, అత్యవసర వైద్య సేవల కోసం ప్రైవేటు ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం, ఆపరేషన్లు చేయడానికి ఆరోగ్యశ్రీ పథకం ఎంతగానో ఉపయోగపడింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 16 లక్షల మంది పైగా ఆరోగ్య శ్రీ పథకం కింద వైద్య సేవలు పొందారు. వీరిలో శస్త్ర చికిత్సలు, వైద్య సేవలు, లాబొరెటరీ పరీక్షలు, ఇన్‌పేషెంట్లు, అవుట్ పేషెంట్లు ఉన్నారు. దాదాపు రూ.543 కోట్ల విలువైన వైద్య సేవలు అందించిన ప్రభుత్వం క్రమంగా నెట్‌వర్క్ ఆస్పత్రులకు బిల్లులు చెల్లిస్తూ వచ్చింది. గతేడాది చివర్లో ఎన్నికలకు సమాయత్తం కావడంతో వచ్చిన ఆంక్షల కారణంగా ప్రైవేటు ఆస్పత్రులకు బిల్లులను చెల్లించలేకపోయింది.

రూ.21 కోట్ల బకాయిలు



ఆరోగ్యశ్రీ వైద్య సేవలు అందిస్తున్న జిల్లాలోని ఎనిమిది ఆసుపత్రులకు కూటమి ప్రభుత్వం దాదాపు రూ.21 కోట్ల వరకు బకాయిలు పడింది. ఇందులో గత ప్రభుత్వ బకాయిలతో పాటు, గత ఆర్నెళ్లకాలంలో జరిగిన వైద్య సేవలకు సంబంధించిన బిల్లులు కూడా బకాయిల్లో ఉన్నాయి. ఇప్పటికే పలుమార్లు ప్రైవేటు ఆసుపత్రుల నిర్వాహకులతో జరిపిన సమావేశాల్లో బకాయిల గురించి అడుగుతున్నా, అధికారులు వింటున్నారే తప్ప.. ప్రభుత్వం ఎలాంటి నగదు విడుదల చేయడం లేదని ఆసుపత్రుల నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న వైద్య బీమా పథకం ప్రజలు ఎలాంటి చెల్లింపులు చేయకుండా కొన్ని వైద్య సేవలు పొందడం, కేంద్ర నిర్వహణలోని ఆయుష్మాన్ భారత్‌లో అంతర్భాగం చేయడం ద్వారా మరికొన్ని వైద్య సేవలు పొందితే ప్రభుత్వ ఖజానాపై భారం ఉండదు. కానీ అలాచేస్తే ప్రజలు తమను మరిచిపోతారని, ప్రతీ ఒక్క అంశాన్ని ఓటు బ్యాంకుతో చూడాలని భావిస్తూ కూటమి ప్రభుత్వం చోద్యం చూస్తోంది.

డైలమాలో ఆస్పత్రులు..

జిల్లాలో ఆరోగ్యశ్రీ కింద చికిత్సలు చేస్తూ, వైద్య సేవలు అందిస్తున్న ప్రైవేటు నెట్‌వర్క్ ఆస్పత్రులు ఎనిమిది ఉన్నాయి. సాధారణ అవుట్ పేషెంట్లతోపాటు, ఆరోగ్యశ్రీ కింద ఇన్‌పేషెంట్లకు ఇక్కడ గత తొమ్మిది నెలలుగా ఆరోగ్యశ్రీ కింద వైద్యం చేసిన ఆస్పత్రులకు ఒక్క రూపాయి కూడా కూటమి ప్రభుత్వం చెల్లించలేదు. గుండె సంబంధింత శస్త్ర చికిత్సలు, చర్మం, ఈఎన్‌టీ, గ్యాస్ట్రో, జనరల్ మెడిసిన్- సర్జరీ, మూత్రపిండ శస్త్ర చికిత్సలు, గర్భాశయ వైద్యసేవలు, క్యాన్సర్, న్యూరో, కంటి వైద్య చికిత్సలు, ఎముకల శస్త్ర చికిత్సలు, చిన్న పిల్లలకు వైద్యసేవలు–శస్త్ర చికిత్స చేసిన జిల్లాలోని నెట్‌వర్క్ ఆస్పత్రులకు ఎన్నికల ముందు కోడ్ కారణంగా గత ప్రభుత్వ హయాంలో చివరన బకాయిలు చెల్లించకపోయింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ఆరు నెలల కాలంలో జరిగిన శస్త్ర చికిత్సలకు కూడా ఎలాంటి చెల్లింపులు చేయలేదు. దీంతో ఆస్పత్రుల నిర్వహణ, ఇక్కడ పనిచేసే సిబ్బందికి జీతభత్యాలు, కరెంటు బిల్లులు లాంటివి చెల్లించలేక నెట్‌వర్క్ ఆస్పత్రుల నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం తమకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించనిపక్షంలో అసలు ఆరోగ్యశ్రీ కింద ఓపీలు చూడాలా..? వద్దా..? ఇంకా ఎంతకాలం వేచి చూడాలి..? అసలు బకాయిలు ఎప్పుడిస్తారు..? అనే ప్రశ్నలతో నిర్వాహకులు సతమతమవుతున్నారు.



ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొంది, కోలుకున్న వ్యక్తికి డిశ్చార్జ్ సమ్మరీ అందజేస్తున్న సిబ్బంది (ఫైల్)

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



108లో తరలిస్తున్న క్షతగాత్రులు

పుంగనూరు: రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు గాయపడిన సంఘటన గురువారం వేకువజామున మండలంలోని ఈడిగపల్లె వద్ద జరిగింది. సీఐ శ్రీనివాసులు కథనం మేరకు.. పలమనేరుకు చెందిన భార్గవ్ (20), బాలు(20), మురళి(19) ద్విచక్రవాహనంలో హార్సిలీహిల్స్ వెళ్లేందుకు వేకువజామున బయలుదేరారు. మార్గం మధ్యలో ఈడిగపల్లె వద్ద రోడ్డు పక్కన ఉన్న స్తంభాన్ని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది బాధితులను మదనపల్లె ఆస్పత్రికి తరలించారు. ముగ్గురు పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మండలంలో క్షుద్రపూజలు



క్షుద్రపూజ చేసిన ఆనవాళ్లు

శ్రీరంగరాజపురం : మండలంలోని 49 కొత్తపల్లిమిట్టలో క్షుద్రపూజ చేసిన సంఘటన ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. స్థానికుల కథనం మేరకు.. బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు 49 కొత్తపల్లిమిట్ట దళితవాడ ప్రధాన రహదారిపై క్షుద్రపూజ చేసిన ఆనవాళ్లు కనిపించాయి. ఈ పూజ ఎవరు చేశారు.. ఎందుకు చేశారు అని అర్థం కావడం లేదని, చాలా భయంగా ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. పోలీసులు రాత్రి వేళల్లో నిఘా పెంచి సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

రంకేసిన ఉత్సాహం



యువత కేరింతలు.. ప్రేక్షకుల అరుపులు.. స్థానికులు కేకలు.. ఆనందోత్సాహాల నడుమ రంకేలేస్తున్న కోడె గిత్తలను నిలువరించేందుకు యువకులు ఉత్సాహం చూపారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా గురువారం వెదురుకుప్పం మండలంలోని కురివికుప్పం, బ్రాహ్మణపల్లెలో జల్లికట్టు కోలాహలంగా సాగింది.





దూసుకుపోతున్న కోడెగిత్తలు (ఇన్‌సెట్) పలక పట్టిన ఆనందంలో యువత

వెదురుకుప్పం : మండలంలోని కురివికుప్పం, బ్రాహ్మణపల్లె గ్రామాల్లో గురువారం జరిగిన ఎద్ల పందేలు హోరెత్తించాయి. తొలుత ఎద్లకు పలకలు, వస్త్రాలు కట్టి పందేనికి సిద్ధం చేశారు. అప్పటికే చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దఎత్తున చేరుకున్న యువత పందేనికి మేము సై అంటూ అల్లి వద్ద నిలబడ్డారు. దశలవారీగా కోడెగిత్తలను ఉసిగొల్పారు. కోడెగిత్తలు రంకెలేసుకుంటూ జన ప్రవాహాన్ని చీల్చుకుంటూ దూసుకుపోయాయి. కోడెగిత్తలను నిలువరించి, పలకలు పట్టేందుకు యువకులు పోటీ పడ్డారు. జనాన్ని చీల్చుకుంటూ పరుగులు తీస్తున్న ఎద్ల వేగాన్ని కట్టడి చేసి, కొన్ని గిత్తల కొమ్ములు వంచి, బహుమతులను స్వాధీనం చేసుకున్న యువకులు తమ వీరత్వాన్ని చాటుకున్నారు. అయితే కొన్ని పోట్లగిత్తలు జన ప్రవాహాన్ని సైతం లెక్కచేయకుండా తమ ప్రతాపాన్ని చూపించాయి. యువకులు ఎంత ప్రయత్నించినా పశువుల దూకుడును కట్టడి చేయలేక నిరుత్సాహపడ్డారు.

గ్రామాల్లో సందడే సందడి..

బ్రాహ్మణపల్లె, కురివికుప్పం గ్రామాల్లో జరిగిన ఎద్ల పందేలు కోలాహలంగా ముగిసింది. సంక్రాంతి పర్వదినాల్లో నాలుగో రోజు గ్రామాల్లో పెద్దఎత్తున జల్లికట్టు నిర్వహించారు. దీంతో చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా కార్వేటినగరం, పెనుమూరు, రామచంద్రాపురం మండలాల నుంచి జనం రావడంతో ఆ గ్రామాలు కిక్కిరిశాయి.

ప్రతి స్కూలులో అంబేడ్కర్ ఫొటో పెట్టాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

చిత్తూరు కలెక్టరేట్ : గణతంత్ర దినోత్సవం రోజున ప్రతి ప్రభుత్వ పాఠశాలలో అంబేడ్కర్ ఫొటో పెట్టించాలని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినాయకం కోరారు. గురువారం ఆ సంఘ నాయకులు విజయవాడలో రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. వినాయకం మాట్లాడుతూ అన్ని శాఖల్లో ఎస్సీ, ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టాలన్నారు. డీఈఓ పూల్‌లో ఉన్న భాషా పండితులకు ఉద్యోగోన్నతులు కల్పించాలన్నారు. అనంతరం ఆ సంఘం నూతన క్యాలెండర్, డైరీలను ఆవిష్కరింపజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు చెన్నకేశవులు, శ్రీకాంత్, గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఏపీసీ బాధ్యతల స్వీకరణ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా సమగ్రశిక్ష నూతన ఏపీసీ వెంకటరమణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయం ప్రాంగణంలో ఉన్న సమగ్రశిక్ష కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టనున్నట్లు ఆ శాఖ అధికారులు వెల్లడించారు.

వైఎస్ జగన్ సంక్రాంతి ఫ్లెక్సీ ధ్వంసం



ధ్వంసం చేసిన జగనన్న బ్యానర్

శ్రీరంగరాజపురం : మండల కేంద్రంలో యూఎం పురం గ్రామానికి చెందిన యువకులు, వైఎస్సార్ అభిమానులు సంక్రాంతి సందర్భంగా ఏర్పాటు చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫ్లెక్సీని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా యూఎం పురం గ్రామానికి చెందిన యువకులు మాట్లాడుతూ నిరంతరం పోలీసుల పర్యవేక్షణలో సీసీ కెమెరా ఉన్నా పోలీసులు ఇంతవరకు బ్యానర్ చించివేసిన వారిపై చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో టీడీపీ, కాంగ్రెస్, వైఎస్సార్, ఇతర పార్టీలకు సంబంధించిన బ్యానర్‌లు ఏర్పాటు చేసినా ఎవరు ధ్వంసం చేసిన సందర్భాలు లేవన్నారు. ప్రస్తుతం రాజకీయ కక్షలతోనే కూటమి శ్రేణులు బ్యానర్‌ను ధ్వంసం చేశారన్నారు. బ్యానర్ ధ్వంసం చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

బాడీ బిల్డర్‌కు మాజీ మంత్రి అభినందన



వెంకటేశ్‌ను అభినందిస్తున్న మాజీమంత్రి ఆర్కేరోజా

నగరి : బాడీ బిల్డింగ్ పోటీల్లో జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన విజయపురం మండలం మాధవరం గ్రామానికి చెందిన క్రీడాకారుడు తోటి వెంకటేశ్‌ను మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్కేరోజా అభినందించారు. మధ్య ప్రదేశ్ ఇండోర్‌లో ఎంపీ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ నిర్వహించిన మిస్టర్ ఇండియా జాతీయ బాడీ బిల్డింగ్, మెన్ ఫిజిక్ చాంపియన్ షిప్ 60 కిలోల జూనియర్ విభాగంలో కేజీ హైడ్రోలిక్ జిమ్ కోచ్ అయిన తోటి వెంకటేష్ జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానం సాధించాడు. దీంతో ఆయన వచ్చే మే నెలలో థాయ్‌లాండ్‌లో నిర్వహించే ఏషియన్ బాడీ బిల్డింగ్ పోటీలకు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా గురువారం మాజీ మంత్రి ఆర్కేరోజాను ఆమె నివాస కార్యాలయంలో కలిసి ఆమె చేతుల మీదుగా మెడల్, ట్రోఫీని అందుకున్నాడు. వెంకటేశ్‌ను మాజీ మంత్రి సత్కరించి అభినందించారు. భవిష్యత్తులో అతను పాల్గొనే పోటీలకు సహాయ సహకారాలు అందిస్తానన్నారు.

పులిగుండు.. భక్త జన దండు



భక్తులతో కిటకిటలాడుతున్న పులిగుంటీశ్వరస్వామి ఆలయ ఆవరణ

- శేషవాహనంపై పులిగుంటీశ్వరస్వామి గిరి ప్రదక్షిణ
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

పెనుమూరు(కార్వేటినగరం): పులిగుండు ప్రాంతం భక్తజన సందోహంగా మారింది. సంక్రాంతి వేడుకల్లో భాగంగా పులిగుండు తిరునాళ్ల గురువారం వైభవంగా జరిగింది. జిల్లా నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు ఈ తిరునాళ్లకు విచ్చేసి పులిగుంటీశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. దీంతో ఆ ప్రాంతంలో భక్తుల రద్దీ నెలకొంది. పులిగుండు పరిసర గ్రామాల ప్రజలు స్వామివారికి పొంగళ్లు పెట్టి, పిండి దీపాలు వెలిగించి, నైవేద్యం సమర్పించారు. తిరునాళ్లలో భాగంగా పులిగుంటీశ్వరస్వామివారిని శేషవాహనంపై కొలువుదీర్చి గుంటిపల్లి రోడ్డు, కనికాపురం రోడ్డు, కొత్త రోడ్డు, ఠాణా వేణుగోపాలపురం, సీఎస్ అగ్రహారం మీదుగా గిరిప్రదక్షిణ చేశారు. తిరునాళ్లలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చిత్తూరు తాలుకా సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. పులిగుంటీశ్వరస్వామి ఆలయ మెట్లదారిలో అక్కడక్కడా భక్తుల సౌకర్యార్థం చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. అలాగే ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో సిబ్బంది భక్తులకు ప్రత్యేక వైద్యసేవలు అందించారు. పలువురు దాతలు భక్తులకు ఉదయం నుంచి రాత్రి వరకు అన్న ప్రసాదాలను పంచిపెట్టారు. మధ్యాహ్నం సుమారు 2 వేల మందికి అన్నదానం చేశారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హరికథా కాలక్షేపంతోపాటు చెక్కభజనలు, కోలాటాలు, నృత్యాలు భక్తులకు కనువిందు చేశాయి. అలాగే ముగ్గుల పోటీలు, క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, గుండాట, టెన్నికాయిట్, పరుగు పందెం, మ్యూజికల్ చైర్స్, సైక్లింగ్ తదితర పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులను అందజేశారు. గిరిప్రదక్షిణ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దయాసాగర్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

ఉపాధి పనుల పురోగతిపై నిత్యం పర్యవేక్షణ



డ్వామా పీడీ రవికుమార్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పనులు పకడ్బందీగా అమలయ్యేలా నిత్యం పర్యవేక్షిస్తున్నట్లు డ్వామా పీడీ రవికుమార్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఉపాధి హామీ పనుల లక్ష్యాలు చేరుకునేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఉపాధి పనుల లక్ష్యాల సాధనలో చిత్తూరు జిల్లా ఆరో స్థానంలో ఉన్నట్లు తెలిపారు. 86 శాతం ఆర్థిక సంవత్సరం టార్గెట్‌ను పూర్తి చేశామన్నారు. గత ఏడాది ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు ఉపాధి కూలీలకు రూ.183 కోట్లు వేతనాలు మంజూరు చేసినట్లు తెలిపారు. 86 లక్షల ఉపాధి హామీ పనుల పని దినాలకు గాను 73 లక్షల లక్ష్యం పూర్తి చేశామన్నారు. ఈ ఏడాది మార్చి 31వ తేదీలోపు మిగిలిన పనిదినాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మెటీరియల్ కాంపొనెంట్ కు రూ.79 కోట్లు, సీసీ రోడ్లు, ఇతర పనులు పెండింగ్ నిధులు రూ.22 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా సీసీ రోడ్లు 179 కిలోమీటర్లు వేయాల్సి ఉండగా 94 కిలోమీటర్లు పూర్తి చేసినట్లు తెలిపారు. గోకులం షెడ్ల నిర్మాణంలో రాష్ట్రంలో జిల్లా మొదటి స్థానంలో ఉన్నట్లు తెలిపారు. 2200 గోకులం షెడ్లు ఏర్పాటు చేయాల్సి ఉండగా 860 పూర్తి చేసినట్లు చెప్పారు. డ్వామా, అటవీ శాఖ ఆధ్వర్యంలో 30 లక్షల మొక్కలను పెంచే కార్యక్రమం చేపడుతున్నట్లు డ్వామా పీడీ తెలిపారు.

దళితుల భూమికి కంచె



వడమాలపేట : ఎనుమలపాళెం దళితవాడకు చెందిన భూమిలో వేసిన కంచె

వడమాలపేట (విజయపురం) : వడమాలపేట మండలం, అప్పలాయగుంట సమీపంలోని ఎనుమలపాళెం దళితవాడకు చెందిన కొందరి భూమిపై టీడీపీకి చెందిన ఓ జిల్లా స్థాయి నాయకుడు కన్ను పడింది. అంతే రాత్రికి రాత్రే కంచి వేశాడు. అంతే కాకుండా అక్రమంగా వేచిన కంచెను తొలగించిన దళితులపైనే కేసు పెట్టి బెదిరించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. వడమాలపేట మండలం ఎనుమలపాళెం దళితవాడలోని దళితులకు ఇళ్ల నిర్మాణం కోసం గతంలో ప్రభుత్వం ఐదు ఎకరాల భూమిని కేటాయించింది. అందులో సుమారు మూడు ఎకరాల్లో ఇళ్లు నిర్మించుకున్నారు. మిగిలిన భూమిని భవిష్యత్ అవసరాల కోసం బీడుగా వదిలిపెట్టారు. అయితే అప్పలాయిగుంట బాగా అభివృద్ధి చెందడంతో పరిసరాల్లో భూమి రేటు బాగా పెరిగింది. ఎకరా రూ.కోటికి పైగా పలుకుతుంది. దీంతో అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ టీడీపీ నాయకుడికి దళితుల భూమిపై కన్ను పడింది. తన అధికార బలంతో రాత్రికి రాత్రే దళితులకు సంబంధించిన భూమిలో కంచె వేశాడు. విషయం తెలుసుకున్న దళితులు దాన్ని తొలగించారు. ఆ గ్రామంలోని దళిత నాయకులను బెదిరించి, డబ్బుకు ప్రలోభ పెట్టి కొందరిని మాట్లాడకుండా చేయించినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై లోలోపల ఆ భూమిని తమ అనుచరుల పేరున మార్చుకోవడం కోసం ఆ జిల్లా స్థాయి నాయకుడు తమ ప్రయత్నం ముమ్మరం చేసినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

సర్వే చేసి న్యాయం చేస్తాం

దళితులకు సంబంధించిన భూమి ఉండడం వాస్తవం. ఆ భూమికి రాత్రికి రాత్రే కంచె వేశారని తెలిసింది. అయితే సర్వే చేసి దళితుల భూమి దళితులకు ఇవ్వడానికి వెళ్లితే వారు ఒప్పుకోవడం లేదు. మాపై ఎలాంటి ఒత్తిడి లేదు. దళితుల భూమిని సర్వే చేసి వారికే ఇస్తాం.

జరీనా, తహసీల్దార్, వడమాలపేట

అర్ధరాత్రిలో.. హాహాకారాలు


- చిత్తూరులో బస్సును ఢీకొట్టిన టిప్పర్
- నలుగురి మృతి..!



బోల్తాపడ్డ బస్సు

చిత్తూరు అర్బన్: మొదలే ఏసీ బస్సు. సరిగ్గా గురువారం అర్ధరాత్రి 11.40గా వస్తోంది. ప్రయాణికులు అప్పుడప్పుడే నిద్రలోకి జారుకుంటున్నారు. ఇంతలో టిప్పర్ రూపంలో మృత్యువు దూసుకొచ్చింది. రెప్పపాటులో బస్సు బోల్తా కొట్టింది. ఎవరికి ఏం జరిగిందో తేరుకునేలోపే బస్సులోని నలుగురు ప్రయాణికులు ప్రాణాలు వదిలారు. పదుల సంఖ్యలో గాయపడినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. స్థానికుల కథనం మేరకు.. తిరుపతి నుంచి తిరుచ్చి బయలుదేరిన ఏసీ బస్సును (టీఎన్ 45 సీసీ 8372) రాత్రి 11.40 గంటల సమయంలో చిత్తూరు సమీపంలోని గాజులపల్లి వద్ద తమిళనాడుకు చెందిన టిప్పర్ ఢీకొట్టింది. ఈ క్రమంలో అదుపుతప్పిన బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న నలుగురు ప్రయాణికులు అక్కడికక్కడే మృతిచెందగా పదుల సంఖ్యలో ప్రయాణికులు గాయపడ్డారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గాయపడ్డ వారిని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు.

గుండెపోటుతో ఉర్దూ డీఐ మృతి



డీఐ అఫ్సర్ ఖాన్(ఫైల్)

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా ఉర్దూ శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ అఫ్సర్ ఖాన్ గురువారం ఉదయం గుండె పోటుతో మృతి చెందారు. రామకుప్పం మండలంలోని ఆరిమానుపెంట జెడ్పీ హైస్కూల్ హెడ్‌మాస్టర్‌గా ఆయన విధులు నిర్వహించేవారు. ఆయన రెండు నెలల క్రితం జిల్లా విద్యాశాఖలోని ఉర్దూ విభాగం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ గా బాధ్యతలు స్వీకరించారు. జిల్లాలోని ఉర్దూ పాఠశాలల అభివృద్ధికి ఆయన కృషి చేశారు. ఆయన ఆకస్మిక మరణం తీరని లోటు అని డీఈఓ వరలక్ష్మి వెల్లడించారు. అలాగే ఆయన మృతికి రియాసతీ ఉర్దూ టీచర్స్ అసోషియేషన్ (రూటా) నాయకులు మహమ్మద్ ఖాన్, అయూబ్ ఖాన్, సయ్యద్ ముష్తాక్ హుసేన్, సయ్యద్ ఇక్బాల్ సంతాపం తెలిపారు.

పాఠశాలల్లో ఓటరు దినోత్సవం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని అన్ని పాఠశాలలో జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు ఆదేశించారు. ఈ మేరకు ఆయన జారీ చేసిన ఉత్తర్వులు గురువారం డీఈఓ కార్యాలయానికి చేరాయి. ఈ నెల 25వ తేదీన జిల్లాలోని ప్రతి పాఠశాలలో జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించాలన్నారు. విద్యార్థులతో ఉదయం 11 గంటలకు సామూహిక ఓటరు ప్రతిజ్ఞ చేయించాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.


నేత్రానందంగా ఊంజల్ సేవ



వరసిద్ధుడి ఊరేగింపు

కాణిపాకం: సంక్రాంతి సందర్భంగా కాణిపాకంలోని వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో గురువారం ఊంజల్ సేవ నేత్రానందంగా నిర్వహించారు. మూలమూర్తికి తొలుత ప్రత్యేక చందనాలంకారం చేశారు. తర్వాత ఉత్సవమూర్తిని అలంకరించి కల్యాణవేదికపై కొలువుదీర్చి ఊంజల్ సేవ జరిపారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈఓ పెంచల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



దామోదరం

తవణంపల్లె: మతి స్థిమితంలేని వ్యక్తి అదృశ్యమైనట్లు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తవణంపల్లె పోలీసులు తెలిపారు. పోలీసులు కథనం మేరకు.. మండలంలోని అరగొండ పంచాయతీ పైమాఘం గ్రామానికి చెందిన ఎం.దామోదరం(70) మతిస్థిమితం లేకుండా తిరుగుతుండేవాడు. ఈ క్రమంలో ఈ నెల 9వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఇప్పటివరకు ఇంటికి రాకపోవడంతో చుట్టు పక్కల గ్రామాలు, బంధువుల ఇళ్లలో గాలించిన ఆచూకీ లభించలేదు. ఈ విషయమై దామోదరం కుమారుడు ఎం.మురళి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.